వ్యవసాయ సలహాదారుని కలిసిన డైరెక్టర్లు

వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న రుద్రూర్ మండల డైరెక్టర్లు

బాన్సువాడ, సెప్టెంబర్ 25 : బాన్సువాడ నియోజకవర్గంలోని రుద్రూర్ మండల మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌ను బుధవారం బాన్సువాడలో కలిశారు. రుద్రూర్ మండలానికి ముగ్గురు ఏఎంసీ డైరెక్టర్లను కేటాయించినందుకు వారు ధన్యవాదాలు తెలిపారు.

మొక్కను నాటిన అదనపు కలెక్టర్

మొక్కను నాటిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

కామారెడ్డి, సెప్టెంబర్ 25 : జిల్లా కేంద్రంలోని యోగా భవనం వద్ద ఔషధ, పండ్ల మొక్కలను అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి బుధవారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచితంగా యోగా క్లాసులు చేయిస్తున్న యోగా గురువు రాంరెడ్డిని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా యోగాసనం స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, స్థానిక కౌన్సిలర్ వేణు, లేబర్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కోటేశ్వరావు, మీడియా ప్రబారి అనిల్ రెడ్డి, రమేశ్, వెంకటేశం, రాజేందర్, ఎల్లయ్య పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ సాధించిన అక్షిత

గోల్డ్ మెడల్‌తో అక్షిత

కామారెడ్డి, సెప్టెంబర్ 25 : కామారెడ్డికి చెందిన పేరం అక్షిత బాలికల (అండర్-17) ఎయిర్ పిస్తోల్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిం ది. హైదరాబాద్‌లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ స్కూల్ జిల్లా స్థాయి ఎయిర్ పిస్తోల్ టెన్ మీటర్స్ టోర్నీ. సెలక్షన్స్‌లో అక్షిత గోల్డ్ మెడల్ సాధించింది. ఈ పోటీలు ఈ నెల 21 నుంచి 23 వరకు నాంపల్లిలోని మదీనా పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించారు. అక్షిత హైదరాబాద్‌లోని హబ్సిగూడలో శ్రీసాయి పబ్లిక్ స్కూల్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్నది. అక్షిత గెలుపునకు సహకరించిన వ్యక్తిగత కోచ్ నిరంజన్‌కు తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, సెప్టెంబర్ 25 : అర్హత కలిగిన కొత్త ఓటర్లను నమోదు చేసుకునేలా బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బూత్‌స్థాయి అధికారులతో సమన్వయం చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని అన్నారు. వచ్చే అక్టోబర్ 29న ఇంటిగ్రేటేడ్ డ్రాఫ్ట్ రోల్ ప్రచురించనున్నట్లు తెలిపారు. ఆ డ్రాఫ్ట్ రోల్‌లో అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే నవంబర్ 9, 10వ తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఫైనల్ పబ్లికేషన్స్ జనవరి 6వ తేదీన ప్రచురిస్తామన్నారు. ఇప్పటి వరకు కామారెడ్డిలో 97.52 శాతం, జుక్కల్‌లో 98.02 శాతం, ఎల్లారెడ్డిలో 99.24 శాతం ఇంటింటి సర్వేను చేసినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సరళ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 25 : పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్ ఆర్య అన్నారు. బీర్కూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భువనేకర్ సంతోష్, మండల బాధ్యులు సంతోష్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 25 : ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ మండలంలోని బుడ్మి గ్రామంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ వ్యాధులు రాకుండా ఉండాలంటే గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన్, ఏపీఎం పద్మ, ఏపీవో గంగాధర్, టీఏ గోపాల్, గ్రామ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కామారెడ్డి రూరల్, సెప్టెంబర్ 25 : కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో వైఆర్‌జీ కేర్ లింకు వర్కర్ స్కీం ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లింకు వర్కర్ స్కీం ఉమ్మడి జిల్లా డీఆర్పీ సుధాకర్ పాల్గొని మాట్లాడారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రామకృష్ణ, నర్సిరెడ్డి, లింకు వర్కర్ బాలకిషన్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్య ఎంతో కీలకం

మాచారెడ్డి, సెప్టెంబర్ 25 : విద్యార్థులకు ఇంటర్ విద్య ఎంతో కీలకమని ఇంటర్మీడియెట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కళాశాల ప్రిన్సిపాల్ యాకుబుద్దీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

గజ్యానాయక్ తండాలో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

భిక్కనూరు/మాచారెడ్డి/బీబీపేట్/రామారెడ్డి, సెప్టెంబర్ 25 : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. భిక్కనూరులో బుధవారం 75 మందికి కల్యాలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి తిరుమలేశ్, జిల్లా కోశాధికారి రమేశ్‌రెడ్డి, మోర్చా అధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు. మాచారెడ్డి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 43 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, డిప్యూటీ తహసీల్దార్ భిక్షపతి, బీజేపీ మండలాధ్యక్షుడు సురేశ్ పాల్గొన్నారు. బీబీపేట్‌లోని రైతు వేదికలో ఆయా గ్రామాలకు చెందిన 32 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్, రెవెన్యూ అధికారులు, లబ్ధిదారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. రామారెడ్డి రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని మద్దికుంట, రెడ్డిపేట్, అన్నారం గ్రామాలకు చెందిన మొత్తం 17 మందికి ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సువర్ణ, గిర్దావర్ వెంకట్‌రాజు, పంచాయతీ కార్యదర్శి లింగాల సాగర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో ఒకరికి జీవిత ఖైదు

కామారెడ్డి, సెప్టెంబర్ 25 : బాలికపై లైంగిక దాడి కేసులో ఒకరికి జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ సింధూశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వరపల్లికి చెందిన బాలిక 2023 మార్చి 8వ తేదీన సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటున్నది. అదే గ్రామానికి చెందిన మరిపల్లి బాలకృష్ణ అలియాస్ బాలరాజ్ బాలికలతో చాక్‌లెట్స్, బిస్కెట్స్ కొనిస్తానని చెప్పి బాలికను ద్విచక్ర వాహనంపై ఊరు శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కల్లు తాగించి, లైంగికదాడికి పాల్పడ్డాడు. చీకటి పడుతున్న సమయంలో గ్రామ శివాలయం వద్ద వదిలి వెళ్లిపోయాడని తెలిపారు. తండ్రి బాలిక కోసం వెతకగా దేవాలయం దగ్గర అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించగా మరుసటిరోజు స్పృహలోకి వచ్చింది. తండ్రికి జరిగిన విషయాన్ని వివరించింది. తండ్రి ఫిర్యాదు మేరకు దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తును ప్రారంభించారు. సాక్షాధారాలను పరిశీలించి, కేసు రుజువు కావడంతో జిల్లా జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్ నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధించారు. మైనర్ బాలిక భవిష్యత్తు అవసరాల నిమిత్తం జిల్లా న్యాయ సేవ సంస్థ ద్వారా రూ.7 లక్షలు అందజేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ కేసును సరైన పద్ధతిలో విచారణ చేసిన అప్పటి డీఎస్పీ సురేశ్, ఎస్సై ప్రసాద్ కోర్టు తరపున వాదనలు వినిపించిన అదనపు ప్రాసిక్యూటర్ శేషు, కోర్టులో సరైన సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ రామన్, ప్రస్తుత ఎస్సై రాజు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ మురళి, కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణ, దేవీచంద్‌ను ఎస్పీ అభినందించారు.

సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ

కామారెడ్డి, సెప్టెంబర్ 25 : జిల్లా కేంద్రంలోని పీజేఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో సాఫ్ట్ స్కిల్స్ పై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గురువేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు టాస్క్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. టాస్క్‌తో పొందిన జ్ఞానం ద్వారా విద్యార్థులు వేగంగా ఉద్యోగాలు పొందేందుకు అర్హులు అవుతారని అన్నారు. కార్యక్రమంలో టాస్క్ ట్రైనర్ హిమబిందు, పిన్సిపాల్ విజయ్ కుమార్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, టాస్క్ ఇన్‌చార్జిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్మన్

బాన్సువాడ, సెప్టెంబర్ 25 : చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ గంగాధర్ అన్నారు. పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో బుధ వారం నిర్వహించిన ఖోఖో బాలబాలికల (అండర్-14, 17) ఎంపిక పోటీలకు మున్సిపల్ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎజాస్, కౌన్సిలర్లు హకీం, నర్సుగొండ, బాబా, అలీమొద్దీన్, ఉదయ్ గుప్తా, రమేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు సురేందర్, ప్రేమ్, అనిల్, తారాచంద్ పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపికకు తేదీలు ఖరారు

బాన్సువాడ, సెప్టెంబర్ 25 : బాన్సువాడ జోనల్ స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలకు బాలబాలికల (అండర్-14, 17) ఎంపిక తేదీలను ఖరారు చేసినట్లు మినీ స్టేడియం మేనేజర్ నరేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న (అండర్ 14, 17) బాల బాలికల కబడ్డీ, 30న వాలీబాల్ క్రీడలకు ఎంపికను పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో ఉద యం 10 గంటలకు సెలక్షన్స్ ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు జోనల్ సెలక్షన్ అధికారి ప్రేమ్‌ను సంప్రదించాలని సూచించారు.

పంటల పరిశీలన

భిక్కనూరు/బీబీపేట్, సెప్టెంబర్ 25 : భిక్కనూరు మండలంలో వరి, పత్తి పంటలను మండల వ్యవసాయాధికారిణి రాధారెడ్డి బుధవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈవో వినోద్‌గౌడ్, నరేశ్, రైతులు పాల్గొన్నారు. బీబీపేటలో వరి పొలాన్ని వ్యవసాయాధికారి రాఘవేంద్ర పరిశీలించారు. వాతావరణ మార్పులతో వరిలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు గమనించి, వాటి నివారణ చర్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలి

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 25: మండల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ విష్ణు అన్నారు. మండలంలోని మాల్తుమ్మెద రైతువేదికలో వాటర్‌మెన్‌లకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. పైప్ లైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు.

పంటల పరిశీలన

లింగంపేట, సెప్టెంబర్ 25: మండలంలోని భవానీపేట గ్రామంలో మంగళవారం ఈదురుగాలులకు నేలకొరిగిన పంటలను వ్యవసాయాధికారులు బుధవారం పరిశీలించారు. పంట నష్టం వివరాల నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. ఆయనవెంట ఏఈవో షేక్ అమీర్, రైతులు సాయిలు, నారాయణ, లక్ష్మణ్, సుభాష్, బలరాం తదితరులు ఉన్నారు.

కారుణ్య నియామకాల్లో అవకాశం కల్పించాలి

లింగంపేట, సెప్టెంబర్ 25: విరమణ పొందిన వీఆర్‌ఏల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల్లో అవకాశం కల్పించాలని కోరుతూ నాయబ్ తహసీల్దార్ సంగమేశ్వర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. 81, 85 జీవోలతో ప్రమోషన్ పొంది తక్కువ బెనిఫిట్స్‌తో ఉద్యోగ విరమణ చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో గంట విజయ్, సంగయ్య, సాయిలు, దుర్గయ్య, భూషయ్య తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీలను సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

వైద్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్

రామారెడ్డి, సెప్టెంబర్ 25: రామారెడ్డి ప్రభుత్వ దవాఖానతోపాటు అన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్ బుధవారం సందర్శించారు. సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలను అందించాలన్నారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. వార్డులను తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్లు సురేశ్, మానసకు పలు సూచనలు చేశారు.

అర్హులకు రుణమాఫీ జరిగేలా చూడాలి

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

బ్యాంకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

మద్నూర్, సెప్టెంబర్ 25: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరిగేలా చూడాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు బ్యాంకు అధికారులకు సూచించారు. జుక్కల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బ్యాంక్ అధికారులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. రుణమాఫీ కోసం బ్యాంకుకు వచ్చిన వారికి పూర్తి వివరాలు తెలియజేయాలని, తగిన సూచనలు, సలహాలు అందించాలని సూచించారు. రైతుల ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాల్లో తప్పులను సవరించాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. సమావేశంలో నాయకులు బ్యాంకు అధికారులతోపాటు నాయకులు నాయకులు సాయిపటేల్, హన్మాండ్లస్వామి, రాంపటేల్, వట్నాల రమేశ్, అమూల్, బాలు, రమేశ్‌దేశాయ్, సాయాగౌడ్, శివానంద్, రాజుపటేల్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లంలో పర్యటించిన సబ్ కలెక్టర్

నీటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశం

విద్యార్థినులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

పెద్దకొడప్‌గల్, సెప్టెంబర్ 25: బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బుధవారం పిట్లం మండలంలో పర్యటించారు. పిట్లంలోని జడ్పీహెచ్ఎస్, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ దవాఖాన, జ్యోతిబాపూలే, కస్తూర్బా పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ దవాఖానలో రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు తాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ వేణుగోపాలరావు, ఎంపీఈవో కమల్, ఎంఈవో దేవీసింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీకేఎస్ మాలోత్ తండా కార్యవర్గం ఎన్నిక

బీకేఎస్ మాలోత్‌తండా నూతన కార్యవర్గ సభ్యులు వీరే

లింగంపేట, సెప్టెంబర్ 25: మండలంలోని మాలోత్ తండా భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సీజీఆర్ఎఫ్ సభ్యుడు రాజాగౌడ్ తెలిపారు. తండాలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని అన్నారు. అధ్యక్షుడిగా మాలోత్ మోహన్, ఉపాధ్యక్షులుగా కొర్ర మోహన్, రమావత్ గణేశ్, ప్రధాన కార్యదర్శిగా మాలోత్ సర్దార్, సహాయ కార్యదర్శిగా సక్రూ, సలహాదారులుగా శ్రీనివాస్, ఢాక్యా, చందర్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

అక్టోబర్ 3న ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 25: ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మర్ ఎన్నికను అక్టోబర్ 3వ తేదీన నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. జూలై 9వ తేదీన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అవిశ్వాస తీర్మాన ఫలితాన్ని ప్రకటించడంతో అప్పటి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ పదవిని కోల్పోయారు. రెండున్నర నెలలుగా ఖాళీగా ఉన్న మున్సిపల్ చైర్మన్ పదవి కోసం అక్టోబర్ 3వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ ఆఫీసర్, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ సమక్షంలో ఎన్నిక ఉంటుందని మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు బుధవారం తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

లింగంపేట, సెప్టెంబర్ 25: మండల కేంద్రానికి చెందిన బెస్త బాబు గుండెపోటుతో బుధవారం మరణించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన బాబు ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులను నిర్వహించేవాడు. బాధిత కుటుంబాన్ని స్థానిక నాయకులు పరామర్శించి, అంత్యక్రియల కోసం రూ.ఐదువేల ఆర్థిక సహాయంతోపాటు 50కిలోల బియ్యాన్ని అందజేశారు. నాయకులు ప్రసాద్‌గౌడ్, ఎల్లమయ్య, అశోక్, రామాగౌడ్, సాయి కుమార్, నగేశ్, మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కాలువ దారి చదును

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 25: పోచారం గ్రామం నుంచి పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువకు వెళ్లే దారి గుంతలు పడి బురదమయంగా మారింది. దీంతో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ సొంత డబ్బులతో మొరం వేయించి ట్రాక్టర్‌తో చదును చేయించారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

పెద్దకొడప్‌గల్, సెప్టెంబర్ 25: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పెద్దకొడప్‌గల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన 23 మంది విద్యార్థినులు అండర్-14, -17 విభాగాల్లో వివిధ పోటీలకు జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికయ్యారని వైస్ ప్రిన్సిపాల్ నాగరాణి బుధవారం తెలిపారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు రాములు, విఠల్, పవన్ తదితరులు అభినందించారు. వారు 28న నిర్వహించనున్న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 25: మండలంలోని పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ బుధవారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, ప్ర ధాన కార్యదర్శి కిష్టయ్య, మండల యూత్ అధ్యక్షుడు శ్రీ రాం, నాయకులు సుధాకర్, ఇమామ్, జీవరత్నం, శేఖర్, మ సూద్, సాయాగౌడ్, అనంత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలకు అనుమతి తీసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 25: మున్సిపాలిటీ అనుమతి లేకుండా పట్టణంలో నిర్మాణాలు చేపట్టవద్దని బల్దియా కమిషనర్ శ్రీహరిరాజు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడారు. అనుమతి ఉండి, సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇంటి ముందర గద్దెలు ఫిర్యాదులు రాకముందే తొలగించుకోవాలని సూచించారు.

ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలి

పల్లకీని మోస్తున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

బిచ్కుంద, సెప్టెంబర్ 25: ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. జుక్కల్ మండలంలోని దోస్‌పల్లి, బంగారుపల్లిగ్రామాల్లో నరేంద్ర మహరాజ్ సంస్థానంలోని తెలంగాణ ఉపపీఠం వసుంధర పాదయాత్ర బుధవారం ప్రారంభమైంది. ఈ పాదయాత్ర మహారాష్ట్రలోని ముఖ్యపీఠం నానిజ్‌దామ్ వరకు కొనసాగుతుంది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే షిండే పాల్గొని పల్లకీని మోశారు. దోన్‌గావ్ వరకు భక్తులతో కలిసి నడిచి వారికి అల్పాహారం ఏర్పాటుచేశారు.

బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్‌కు సన్మానం

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 25: బదిలీపై వెళ్తున్న మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సాయిబాబాను పలువురు నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌గా 11 ఏండ్లపాటు పనిచేసి అందరి మన్ననలు అందుకున్నాడని ప్రశంసించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రశాంత్‌గౌడ్, షెకావత్‌అలీ, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

పనులను నిలిపివేశారని ఫిర్యాదు

ఫిర్యాదును అందజేస్తున్న రైతులు

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 25: తమ భూముల్లో పనులు చేసుకోనివ్వడం లేదని మండలంలోని మాసన్‌పల్లి రైతులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం 1982-83 సంవత్సరంలో ఎనిమిది ఎకరాల 30 గుంటల భూమికి ప్రభుత్వం తమకు పట్టాలను అందజేసిందని తెలిపారు. రెవెన్యూ అధికారులు మంగళవారం వచ్చి పనులు చేయొద్దని నిలిపివేయించారన్నారు. వారి పట్టా పాసుబుక్కులు, పహాణీల నకలు తీసుకున్న తహసీల్దార్.. గ్రామంలో శుక్రవారం సర్వే చేయిస్తామని తెలిపారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో గ్రామ మాజీ సర్పంచ్ అంజాగౌడ్, 20మంది రైతులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★అనఘా షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు సూపర్‌వైజర్ (M/F) Sal:15000/- అనుభవం గల ఎలక్ట్రిషియన్ (డిప్లొమ ఎలక్ట్రిషియన్) Sal:15000/- month మరియు సెక్యూరిటీ గార్డ్స్ (M/F) Sal:12000/- month కావలెను. ఆసక్తి గలవారు వెంటనే I.D. ప్రూఫ్, ఫోటోతో సంప్రదించండి. అనఘా షాపింగ్ మాల్, R.P రోడ్, నిజామాబాద్ NTZ-334461

BUSINESS OFFER

★మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతినెలా ఆదాయం కావాలా? మీ దుకాణానికి ప్రచార ప్రకటనలు జోడించి ప్రతినెలా 7,000/- ఇస్తాము. Ph: 9948000371, 9948000373. NT-338751

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ 4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే. ప్ర